# తప్పా?

-దావులూరి జయలక్ష్మి

ఉగాది వస్తోందన్న ఉత్సాహంతో పులకించిన వేపచిగుళ్ళు పూతలు నవ్వుతూనే వున్నాయి. వసంతోదయానికి స్వాగతం పలికిన వల్లీమాలికలు ఆనందహేల నృత్యం చేస్తూనే వున్నాయి. వాటి ఆనందాన్ని తిలకించిన సూర్య భగవానుడు వుప్పొంగిపోయాడు.

అందుకే తన వెలుగుల జిలుగులను మరింత హెచ్చించాడు. కానీ ఆయన ఆనందాన్ని భరించడం, తట్టుకోవడం మాత్రం మామూలు మనుష్యులకు సాధ్యం కావడంలేదు. అంతఃపురాల్లో ఉండేవారికి వేడయినా చలైనా వచ్చే కష్టం, నష్టం ఏమీ లేదు. కానీ పగలంతా బజార్లలో పడి పని చేసేవారి పని మాత్రం ఆపశోపాలతోనే సరిపోతోంది.

సమయం ఉదయం పదకొండు గంటలవుతోంది. కారమన్నం తిన్న కడుపూరుకుంటున్నా నోరు మాత్రం తహతహలాడిపోతోంది. పెదవులు ఎండిపోతున్నాయి.

నాలుక పిడచకట్టుకుపోతోంది. వస్తూ పిడికెడు అన్నంతోపాటు తెచ్చుకున్న పెద్ద బాటిల్‌లో నీళ్ళు మాత్రం ముందే అయిపోయాయి. కనుచూపు మేరలో గుక్కెడు నీళ్ళు దొరికే అవకాశం మాత్రం కనిపించడంలేదు. దాహం తట్టుకునే స్థితి దాటిపోయింది. ఇంకా సగం రోడ్డు అలాగే వుంది. వూడ్చే ఓపిక నశించింది.

కళ్ళు, తల తిరుగుతున్నాయి. చారెడు నీళ్ళు నోట్లో పడితేగానీ ప్రాణం నిలిచేటట్లులేదు. చుట్టూ వున్న ఇళ్ళన్నీ బంగ్లాలే. మారాజులు పిలిచినా పలికే స్థితిలో ఉండరు. ఇంక నీళ్ళు ఇస్తారా? ఇడ్లీ బండున్నా నీళ్ళు దొరికేవి. పాన్‌షాప్ వున్నా నీళ్లు దొరికేవి.

కానీ ఈ బజారులో అలాంటి చిన్నచిన్న షాపులు కనుచూపుమేర కనిపించవు. ఏం చేయాలి? ఏం చేయాలి? ఆలోచనలతో హైరానా పడుతోంది. అశక్తతతో ఆందోళన పడుతోంది. ఇంక ఏం చేయగలిగిందీ లేక ఏమైనాసరే గుక్కెడు నీళ్ళు ముందు తాగాలన్న తపనతో తహతహలాడింది రమణమ్మ.

చీపురు ప్రక్కన పడేసింది. లేని ఓపిక తెచ్చుకుని ఆ నాలుగు బారల దూరం నడిచింది. గడప దగ్గర నిలబడి తలుపు కొట్టబోయింది. మళ్లీ సంశయం. మళ్ళీ ఆశ. మళ్ళీ సంశయం మళ్లీ ఆశ. చివరకు ఆశే గెలిచింది.

తలుపు తట్టింది. ఎవరూ పలకలా. ఒకసారి రెండుసార్లు మూడుసార్లు. అయినా జవాబు రాలేదు.

'అమ్మా...అమ్మా' అంటూ లేని ఓపిక తెచ్చుకుని మళ్లీ పిలిచింది. జవాబులేదు. తలెత్తి చూసింది. కాలింగ్ బెల్ కనబడింది. ఇంక వూరుకోలేక గట్టిగా నొక్కేసింది. నిలబడలేక అక్కడే అలా కూలబడిపోయింది.

"పనిపాటా లేకపోతేసరి. ఓ వేళాలేదు పాళా లేదు. ఎవరో ఒకరు టపటపా నొక్కుతూనే వుంటారు. నొక్కడమేగా కష్టమేముంది? తడవతడవకూ తలుపు తీసేసరికి తాడు తెగుతోంది. వాళ్లకేం బాగానే వుంటారు. నే చస్తున్నా" అంటూ విసుక్కుంటూ లోపలినుండి సుశీలమ్మగారు తలుపు దగ్గరకు వచ్చారు. భళ్ళున తలుపు తెరిచారు. ఎదురుగా రమణమ్మ.

"నువ్వటే! ఓసి నీ అఘాయిత్యం పాడుగానూ. నువ్వా బెల్లు కొట్టడమేనా? ఏం? మాకేం పనీ లేదనుకున్నావా? లేకపోతే గడప దగ్గరే కాపలా వుంటామనుకున్నావా? అవ్వ..అవ్వ...ఎంత ఇదే నీకు? ఏం పోయే కాలమొచ్చిందట అంత అర్జంటుగా గంట కొట్టడానికి? పూజా పునస్కారం చేసుకునే వాళ్లం మడి దడి ఉండవనుకున్నావా? వేళాపాళా లేకుండా ఇలా గంట కొట్టడమేనా?" అంటూ నాన్‌స్టాప్‌గా మాట్లాడే సుశీలమ్మగారిని చూస్తే అడగాలనుకున్న నీళ్ళు కూడా అడగలేకపోయింది రమణమ్మ. తెల్లబోయి అలాగే చూస్తూ ఉండిపోయింది.

"అద్సరే... ఏమిటట ఆ రాచకార్యం? అఘోరించు" అంటూ దీర్ఘం తీసారు సుశీలమ్మగారు.

ఆవిడ మాటలకు కంగారు పడిన రమణమ్మకు నోట మాట కూడా పెగలడంలేదు.

"ఏమిటీ? తాపీగా పీఠం వేసుకుని కూర్చున్నావు? విస్తరేసి వడ్డిస్తాననుకున్నావా? లేలే లేవకపోతే ఇంక వడ్డింపులు తప్పవు" అంటూ వ్యంగ బాణాలు విసిరారు.

రమణమ్మ అయోమయ స్థితిలో ఉండిపోయింది.

"ఏమిటీ! ఈ గడప ముందర ప్రాణాచారం. ఎందుకొచ్చావో ఏడువు?" అంటూ మళ్లీ విసుక్కున్నారు.

నెమ్మదిగా లేచి నిలబడింది రమణమ్మ. నోరు పెగుల్చుకుని "కాసిని మంచినీళ్ళు పోయండమ్మా!" అని అడిగింది.

ఆమె అడిగిన తీరు ఆమె దాహాన్ని చెప్పకనే చెబుతోంది.

అయినా అదంతా గుర్తించే స్థితిలో లేదు సుశీలమ్మగారు "ఏమిటీ! నీకు నీళ్ళు ఇవ్వాలా?" అంటూ ఆశ్చర్యపోయారు.

"అవ్వ... అడగడానికి నీకు మా ఇల్లే దొరికిందా? ఆచారం అనాచారం లేకుండా అడిగేయడమేనా? ఈ బజారులో ఇంక ఇళ్ళే లేవా? పో... పోయి మరో ఇంట్లో అడుక్కో. అయినా ఆ చీపురుతోపాటు ఓ సీసా నీళ్ళూ తెచ్చుకోవచ్చుగా? బద్ధకం. పోయక ఛస్తారా అన్న ధీమా. నీళ్ళూ లేవు గీళ్ళూలేవు. పంపు నీళ్ళు పది బిందెలు తెచ్చి పెట్టాలా? వచ్చిన వాళ్లందరికి వొంచి పోయడానికి? వెళ్ళు వెళ్లు" అంటూ తలుపు వేయబోయారు.

బయట అత్తగారి అరుపులు లోపలున్న సరోజకి వినిపిస్తూనే వున్నాయి. 'మళ్ళీ ఏమయింది? ఎవరిమీదో అరుస్తున్నారు?' అనుకుంది.

ఆ అరుపులు ఎంతసేపటికీ ఆగకపోయేసరికి ఎవరా వచ్చింది అని బయటకి వచ్చింది. బయట రమణమ్మ తల వంచుకుని నిలబడి వుంది.

"ఓ రమణమ్మా! నువ్వా? ఏమిటి ఇలా వచ్చావు?" అంది అభిమానంగా.

సరోజుకు రమణమ్మ నిజాయితీ మీద, పని మీద శ్రద్ధ చూపడంమీద అభిమానం కలిగింది. అది పెరుగుతున్నదేగానీ తరగడంలేదు.

రమణమ్మ ఆ బజారును వూడ్చడానికి వచ్చిందంటే వీధులన్నీ అద్దంలా వుంటాయి. మూలమూలలా శుభ్రంగా వూడుస్తుంది. గుంటలలోను, గోడల పక్కన పేరుకుపోయిన కాగితాలను ఏరి మరీ తీసేస్తుంది.

ఎవరన్నా చూస్తే ఒకరకం, చూడకపోతే ఒక రకం పని చేసేవాళ్లే ఎక్కువ. వీధులు వూడ్చినా చీపురు అటూ ఇటూ నాలుగు బారలు వేసేవాళ్ళే ఎక్కువగానీ ఇలా రమణమ్మలా బాధ్యతగా పని

చేసేవాళ్ళు చాలా తక్కువ. అందుకే సరోజకు రమణమ్మ పని నచ్చుతుంది. రమణమ్మను మెచ్చుతుంది. ఆ అభిమానమంతా సరోజ మాటల్లో వ్యక్తమయింది.

"ఈ ఎండకు గొంతెండిపోతోందమ్మా. కాసిని మంచినీళ్ళు అడుగుదామని..." అన్నది.

"అయ్యో! అలాగే తెస్తానుండు" అంటూ లోపలికెళ్లి చెంబుతో మంచినీళ్లు తెచ్చింది.

"ఎండలు మండిపోతున్నాయి. ఎండలోనేకదా పని? ఎంత దాహంగా వుందో త్రాగు" అంటూ చెంబు అక్కడ పెట్టింది.

సుశీలమ్మగారికి కోడలు వ్యవహారం అసలు నచ్చలేదు. మొహం చిట్లించారు. చెంబుతో నీళ్లు ఇచ్చేసరికి కంగారు పడ్డారు.

"అయ్యో! అయ్యో! అదేం పనే. వాడుకునే చెంబుతో నీళ్లిస్తావుటే. మళ్ళా ఆ చెంబు మనం వాడుకోవాలా? నీళ్లివ్వడమే గొప్పనుకుంటే చెంబు కూడానా? వుండు మగ్ తెస్తా" అంటూ గబగబా లోపలికెళ్లారు. సరోజ ముఖం చిన్నబోయింది. ఆమె అశక్తత ఆ ముఖంలో చూడగలిగింది రమణమ్మ.

ఓ నిర్వికారమైన నవ్వు నవ్వింది. 'నీళ్లిస్తున్నారు కదమ్మా. పర్వాలేదులే' అన్న భావం ఆ నవ్వులో చూసింది సరోజ.

సుశీలమ్మగారు తెచ్చిన మగ్ చూసి సరోజ తెల్లబోయింది. కడుపులో దేవినట్టయింది.

"ఈ మగ్గా?"

కానీ ఏమీ అనలేని పరిస్థితి. అత్తగారి చాదస్తాన్ని, మూర్ఖత్వాన్ని మనసులో నిరసించకుండా ఉండలేకపోయింది.


★★★

"అమ్మాయ్ సరోజ! ఈ రోజు హనుమజ్జయంతి కదా. కాలనీలోని గుడికి వెళ్లి వస్తా" అన్నారు పూజా సామగ్రి బుట్ట చేత పట్టుకుని.

"ఇప్పుడా? ఇంత ఎండలోనా? అంత దూరం ఒక్కరూ ... ఎందుకత్తయ్యా" అంది సరోజ.

"అదేమిటే ఆ మాటలు గుడికి వెళ్తానంటే అలా అనొచ్చా."

"అసలే బిపి, షుగరు, ఆపైన వద్దన్నా వినకుండా ఉపవాసం కూడా ఉన్నారు. ఆటోలు కూడా దొరకవు. అంత దూరమెందుకత్తయ్యా. దగ్గరున్న గుడికి వెళ్లి రండి."



## ఎక్స్‌రే గరల్

పదహారేళ్ల నటాషా డెంకినా అనే రష్యన్ అమ్మాయి ఓ అసాధారణ వ్యక్తి. ఆమె కళ్లు ఎక్సరేలా పనిచేస్తాయిట. ఎవరినైనా ఎదురుగా నిలబడి ఆమె చూస్తే చాలు... వారి శరీరంలో ఏముందో ఆమె తలుపు తెరచి చూసినట్లు లోపలేముందో చెప్పేస్తుంది. ఆమె చెపుతున్నది నిజమేనని పరిశోధకులు నిర్ధారిస్తున్నారు. నటాషా మీద రకరకాల పరీక్షలు చేసిన డాక్టరు ఐరినా కొచన్ "నిజమే! ఈ పిల్లలో అపురూపమైన శక్తుంది" అన్నారు. ఆ వార్త పత్రికలలో వచ్చాక ఆమె పేరు మారుమోగిపోయింది. సాయం కోరివచ్చే పేషెంట్లతో ఆమె ఇంటి ముందు నిత్యం ఒక క్యూ తయారవుతోంది. ఇప్పుడు వింతలకీ ప్రపంచంలో అంతంటూ ఉండదేమో.

## ఫలించిన తపస్సు

డిసెంబరు 1993లో ఒక కొండ చరియ మీద నుంచి ఒక విద్యార్థి జారిపడిపోతుంటే అతన్ని రక్షించబోయాడు టీచరు సూయాలి యాంగ్. విషాదమేమంటే ఆ పిల్లవాడు ఆ ప్రమాదంలో చనిపోవటమే కాకుండా ఆ టీచరు తలకి బాగా దెబ్బ తగిలి మరణసదృశ్యమైన కోమాలోకి వెళ్లిపోయాడు. భార్య తనకెందుకూ పనికి రాడనుకుందో ఏమో అతన్ని వదలి పెట్టి వెళ్లిపోయింది. కానీ తల్లి ప్రాణం ఎలా ఊరుకుంటుంది? కళ్లల్లో వత్తులు పెట్టుకొని సపర్యలు చేసింది కన్నతల్లి. ఆమె పదేళ్ల తపస్సు ఫలించింది. ఇటీవలే ఒక రోజున కళ్లు కదుపుతూ 'అమ్మా!' అని పిలిచాడామె కొడుకు. 'ఈ పదేళ్లల్లో నేను విన్న అత్యంత మధురమైన స్వరం ఇదే' అంటూ ఉప్పొంగి పోయిందా ప్రేమమూర్తి.

**-విమలారామం**

"బాగుందే నీ వరస. ఆ అంజన్న ఈ అంజన్న ఒక్కరేలా అవుతారే? అది పెద్ద గుడి. వైభవంగా ఉత్సవం జరుగుతోంది. ఆ వేడుక ఈ గుడికి వుందా? నాకేం ఫర్వాలేదుగానీ ఆ గుడికే వెళ్లి వస్తా. ఇదిగో కాస్త ఆలస్యమయినా కంగారుపడకండి. నాకేం కాదు" అంటూ ధీమాగా నవ్వుకుంటూ ముందుకు అడుగు వేసారామె.

అత్తగారి చాదస్తానికి బాధపడాలో, ఆమె అమాయకత్వానికి విచారపడాలో తేల్చుకోలేక తెల్ల ముఖం వేసి అలాగే నిలబడిపోయింది సరోజ.

***

ఎండ మండిపోతోంది. నడినెత్తిన సూర్యుడు కిరణాలతో పొడుస్తున్నాడు. వయసులో వున్నవారికి కూడా అవి తట్టుకోవడం కష్టంగానే వుంది. ఇంక సుశీలమ్మగారిలాంటి వారి పని ఆపసోపాలుగానే వుంది. అందులో గుడిలో రద్దీ ఎక్కువై నెట్టుకోవడం, తోసుకోవడం.

దైవదర్శనానికే వచ్చినా క్రమంలో నిలబడే శిక్షణలేదు. ఆగిచూసే ఓపికా లేదు. ఎవరికివారికి ఎంత ముందు దర్శనమైతే అంత ఎక్కువ పుణ్యం వస్తుందన్నట్లు వుంది.

ఈ తొక్కిడితో తీర్థ ప్రసాదాలు తీసుకోడం ఒక ప్రహసనమే అయింది.

ఆ ఎండకు, ఆ హైరానాకు సుశీలమ్మగారికి దాహమయింది. ఆ దేవాలయ ప్రాంగణంలో ఏడెనిమిది పంపులు వరుసగా ఏర్పాటు చేయబడి ఉన్నాయి.

తాగేవాళ్ళు కూడా నెట్టుకుంటూనే వున్నారు. ఒకరు తాగే నీరు మరొకరిమీద పడుతున్నాయి.

పంపుల దగ్గరకొచ్చిన సుశీలమ్మగారు ఈ గోల చూసి నీళ్ళు తాగలేకపోయారు. తాగాలనిపించలేదు కూడా. వెనుదిరిగారు. ఎంతసేపు ఓ పావుగంట ఓపిక పడితే ఇంటి దగ్గర వుంటా అనుకున్నారు.

నీళ్ళు తాగకుండానే గుడి బయటకు వచ్చారు. ఆ తొక్కిసలాటలో అసలు దైవదర్శనం బాగా జరిగిందా?

ఆ దేవుడ్ని కళ్లారా చూడగలిగానా అన్న భావం కలగక పోగా ఎప్పుడు బయటపడదామా అనుకుంటూ ముందుకు జరిగారు.

ఇప్పుడు గుడి బైట కాలు పెట్టగానే ఒక్కసారిగా అమ్మయ్య అని గాలీ పీల్చారు.

కనులారా స్వామిని దర్శించుకోవాలన్న ఆత్రతలో ఆకలిదప్పులు తెలియలేదు. ఇప్పుడు నీరసం తెలుస్తోంది.

దప్పిక నిలువ నీయడంలేదు. త్వరగా ఇంటికి చేరాలనుకున్నారు.

ఆటోలాంటి వాహనంకోసం చూసారు. అదెక్కడా కనుచూపుమేరలో కనిపించలేదు. ఇంక తప్పదని వడిగా అడుగులు వేయడం మొదలుపెట్టారు.

పదినిముషాలు పది గంటలుగా నడిచారు. దప్పిక తట్టుకోవడం కష్టంగా వుంది. కానీ తప్పదు. బలవంతంగా నడుస్తున్నారు. నడుస్తూ నడుస్తూనే కళ్ళు తిరిగి పడిపోయారు.

***

ఎండయినా వానయినా జీవనగమనం ఆగదు కదా. ఎవరి ప్రయాణం వారిది. ఎవరి సుఖం వారిది. ఎవరి వీలు వారిది. ఆ మండుటెండలోనూ ఆ రోడ్డుమీద ప్రయాణించేవారు లేకపోలేదు. స్కూటర్లమీద వెళ్తున్న యువకులూ వున్నారు. సైకిళ్లమీద వెడుతున్న కుర్రాళ్లు ఉన్నారు. ఆటోల్లో వెళ్తున్న ఆడబడుచులూ ఉన్నారు. శక్తి ఉన్నా లేకపోయినా అవసరానికి నడిచి వెళ్తున్న పెద్దలూ ఉన్నారు.

అయితేనేం ఎవరి తొందర వారిది. మనకెందుకులే అనుకునే మనస్తత్వం మరికొందరిది. ఆగితే అంటుకుంటుందేమో అనే భయం ఇంకొకరిది. ఏది ఏమయితేనేం ఆ రోడ్డున ప్రయాణించే ఎవరికీ ఆగి సుశీలమ్మగారిని పరికించే ఓపిక, ఆసక్తి లేకపోయాయి.

పాపం ఆవిడ అలాగే పడిపోయి ఉన్నారు. దాహంతో నాలుక చుట్టుకుపోతున్నా చెప్పే స్థితిలో లేరు.


***

ఆ దారినే ఆ ఎండలో అదే చీపురు, అదే ప్లాస్టిక్ బక్కెట్‌తో రమణమ్మ వస్తోంది. పడిపోయిన ఆమెను చూచి "అయ్యో ఎవరో పడిపోయారు" అని ఆగింది.

దగ్గరగా వెళ్లి చూసింది. సుశీలమ్మగారు. 'అమ్మ ఈడ పడిపోయిందేంటి?' రమణమ్మకు ఆదుర్దా కలిగింది. ఆ స్థితి చూస్తే దాహంతో తహతహలాడుతున్నట్లే వుంది.

ముందు కాస్త మొహం మీద నీళ్లు జల్లితే తేరుకోవచ్చు. కాసిని మంచినీళ్ళు తాగిస్తే లేస్తారేమో అనుకుంది.

తన ప్లాస్టిక్ సంచిలో తన నీళ్ల బాటిల్ గుర్తుకు వచ్చాయి. కానీ సంశయించింది.



ఈ అమ్మకు ఆచారమెక్కువ. నా బాటిల్‌లో నీళ్ళు ఎలా పోయను? దగ్గరలో ఏవన్నా ఇళ్ళు ఉన్నాయేమోనని చూసింది.

కొంచెం దూరంలో కూల్‌డ్రింక్ షాపు కనిపించింది.

ప్రాణం లేచి వచ్చినట్టయింది. గబగబా ఆ షాపు దగ్గరకు పరుగెత్తింది.

"బాబూ! కాసిని మంచినీళ్ళు ఇవ్వండి" ఆత్రుతగా అడిగింది.

"మంచినీళ్లా? ఇక్కడ ఏం పెట్టలేదు" అతని జవాబు.

"పోనీ ఓ సోడా కొట్టివ్వండి బాబూ"

"సోడానా? అవెక్కడున్నాయి? కావాలంటే కూల్‌డ్రింక్స్ ఉన్నాయ్.'

"పోనీ అదే ఇవ్వండి బాబూ. ఆ అమ్మ రోడ్డు మీద పడిపోయింది. కాసిని తాగిస్తా."

"డబ్బులియ్యి ముందు."

అలాగేనంటూ జాకెట్‌లోనుండి ఓ చిన్న సంచి బైటికి తీసింది. అందులో చిల్లర లెక్కపెట్టింది. నాలుగు రూపాయలు వున్నాయి.

"నాల్గు రూపాయలున్నాయి. తీసుకోండి బాబూ. ఓ సీసా ఇవ్వండి."

"నాలుగు రూపాయలకు కూల్‌డ్రింక్ రాదు."

"ఎంత బాబూ?"

"ఐదు రూపాయలు."

"అయ్యో! ఒక్క రూపాయి తక్కువుంది. రేపు తెచ్చిస్తా, త్వరగా సీసా ఒకటి ఇవ్వు."

"రేపు తీసుకో. ఇది సత్రం కాదు. పోపో" ఆ గొంతులో వెటకారమేగానీ కరుణ కనిపించలేదు.

రమణమ్మకు గుండె నీరు కారింది. అయినా ఆలస్యం చేయకుండా ప్రక్కన మరో షాపుకు వెళ్లింది.

అది కిరాణా షాపు. బేరం లేదు. యజమాని పేపర్లో ముఖం పెట్టాడు.

రమణమ్మ ఆత్రుతగా "బాబూ! ఆ అమ్మ పడిపోయింది. కాసిని మంచినీళ్ళు ఇవ్వండి బాబూ" అంది.

అతను పేపర్లోంచి ముఖం తీయలేదు. ఎదుటి మనిషి ముఖం చూడలేదు. "వంపొచ్చి పదిరోజులయింది. మంచి నీళ్లెక్కడివి? మేమే బాటిల్స్ కొనుక్కుంటున్నాము" అన్నాడు.

ఏం చేయాలో తోచలేదు రమణమ్మకు. తలెత్తి చూస్తే కొంచెం దూరంలో ఓ ఇల్లు కనిపించింది. ఆ ఇంటి వాళ్లన్నా కాసిని మంచినీళ్ళు ఇవ్వకపోతారా అన్న ఆశతో గబగబా అటు అడుగులేసింది. ఆత్రుతగా తలుపు తట్టిన రమణమ్మను చూసి ఆ ఇంటి యజమానురాలు ముఖం చిట్లించింది. విసుగ్గా "అడుక్కోవడానికి కూడా ఓ వేళాపాళా వుండాలి. అన్నం ఏమీ మిగల్లేదు. వెళ్ళు. మరో ఇంట్లో అడుక్కో" అంటూ తలుపు వేయబోయింది.

రమణమ్మ జాలిగా "అన్నం కాదమ్మా. కాసిని మంచినీళ్లు ఇవ్వండమ్మా."

"మంచినీళ్లా? ఇంకా నయం. ఫ్రిజ్ నీళ్ళు అడగలేదు" అంటూ హేళనగా నవ్వింది.

"పాతికరూపాయలు పెట్టి బిందె నీళ్ళు కొనుక్కుంటూ నీళ్లు ఇవ్వాలా నీకు? బాగా అడిగావే?" అంది.

"అది కాదమ్మా. ఆ అమ్మ రోడ్డుమీద పడిపోయిందమ్మా. దాహం తీర్చడానికి కాసిని మంచి నీళ్లు ఇవ్వండమ్మా. ఆ అమ్మ ప్రాణాలు కాపాడిన వారవుతారు."

"బతికున్నవాళ్లకే నీళ్ళులేవుగానీ చచ్చేదానికి నీళ్ళు కావాలా?" అంటూ నిర్దయగా మాట్లాడిన ఆమెను ఏమని అడిగితే నీళ్లిస్తుందో తెలియక వెనుదిరిగింది రమణమ్మ. సుశీలమ్మగారి దగ్గరకు ఆత్రుతగా, ఆదుర్దాగా వచ్చింది రమణమ్మ. ఆమె దాహంతో గిలగిలలాడుతున్నారు.

కనురెప్పలు కొంచెం కదులుతున్నాయి. గొంతు దగ్గర గుటకపడక కొట్టుకుంటున్న ఇబ్బంది.

ఇంక రమణమ్మ ఆగలేకపోయింది. గబగబా తన ప్లాస్టిక్ సంచీలో నుండి బాటిల్ తీసింది. సగం వరకు నీళ్ళు వున్నాయి.

ఆ నీళ్లవంక, సుశీలమ్మగారివంక తిప్పి తిప్పి చూసింది. ఈ నీళ్ళు నేను తాగిన నీళ్ళు. ఇవి అమ్మకు ఎలా ఇవ్వను.

ఇవ్వకపోతే ప్రాణం నిలిచేటట్టు లేదు. దిగులుగా దేవుడి గుడివైపు తిరిగింది.


'భగవంతుడా! ఏదన్నా పాపం వుంటే అది నాదేకానీ ఈ అమ్మది కాదు. నన్ను క్షమించు' అంటూ నీళ్ళు కాసిని ముఖం మీద చల్లి కొంగుతో తుడిచింది. నోరు తెరిచి కొద్దికొద్దిగా నీళ్ళు గొంతులో పోసింది. సుశీలమ్మగారు గుటకలేసారు.

కొద్ది నిముషాలకు కళ్ళు తెరిచిన సుశీలమ్మగారికి ఎదురుగా రమణమ్మ. ఆవిడ ఆశ్చర్యంతో కళ్లింత చేసుకుని చూసారు.

"తప్పుంది అమ్మా. తప్పు లేదు" అంటూ చేతులెత్తి దండం పెట్టి తల వంచుకుంది రమణమ్మ.

తప్పెవరిదో తెలిసిన సుశీలమ్మగారికి కళ్లవెంట నీరు ఆనందభాష్పాలై జాలువారాయి.

★



## మంచితనం

ఆపదలో 'నేనున్నాను' అని భరోసా ఇచ్చేవారు మన సమాజంలో చాలా తక్కువమంది ఉంటారు. అలాంటి అరుదైన వ్యక్తిత్వాన్ని పుణికిపుచ్చుకుని కొత్త సినిమాలో అందరికీ కన్పించనున్నాడు మన నాగ్. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం త్వరలో జనం ముందుకి రాబోతోంది. అందాలతారలు ఆర్తీ అగర్వాల్, శ్రియ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కామాక్షి మూవీస్ సంస్థ నిర్మిస్తోంది. వి.ఎస్.ఆదిత్య ఈ చిత్రానికి మంచి సంగీతాన్ని అందించారు. 'నాగార్జున అభిమానుల్ని ఈ చిత్రం అలరిస్తుంది' అంటున్నారు నిర్మాత.

